

నేడు హోంమంత్రి వనిత రాక

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత జిల్లాలో ఈనెల 14,15 తేదీల్లో పర్యటిస్తారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. జిల్లాలో అధికారికంగా పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా మండలంలోని చినబొండపల్లిలో కొత్తగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. 15న జిల్లా కేంద్రంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాథ రావు, బంకురి రవికుమార్, స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, సీనియర్ నాయకులు భీమవరపు తదితరులు పాల్గొన్నారు.

ఇటు వాతలు... అటు కోతలు

- 42 యూనిట్లకు రూ.307 బిల్లు
- విద్యుత్ భారాలతో బెంబెలెత్తుతున్న వినియోగదారులు
- అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు



ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్/కురుపాం

జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఒక వైపు విద్యుత్ బిల్లు వాతలతో అవస్థలు పడుతుంటే మరో వేళాపాల లేని కరెంటు కోతలతో సతమతమవుతున్నారు. దీంతో తమ పరిస్థితి అటు వీపు దెబ్బ.. ఇటు చెంపదెబ్బలా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిమాండుకు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో ఇఎల్ఆర్ విధిస్తూ అప్రకటిత కోతలు విధిస్తున్నప్పటికీ ఎలాంటి కోతలు లేవని అధికారులు బుకాయిస్తున్నారు. పట్టణాలతో పాటుగా, పల్లెల్లో సైతం కోతలు అనివార్యమవుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ బిల్లులు వినియోగదారులకు కంటిపై కునుకులేకుండా చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పెను భారంగా తయారయ్యాయి. ఈ ఏడాది తగినన్ని వర్షాలు కురవకపోవడంతో నీటికొరతతో వరినాట్లు కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. విద్యుత్ కొరత వల్ల బోర్లు ఉన్నప్పటికీ రైతులు వ్యవసాయానికి ఉపయోగించుకోలేని పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉండగా సర్‌ఛార్జీల పేరుతో బిల్లులు పెనుభారంగా తయారయ్యాయి. 'గతంలో వినియోగించిన విద్యుత్‌కు విద్యుత్ సంస్థ సర్దుబాటు, సర్‌ఛార్జీలు, ఇంధన ఛార్జీల పేరిట వసూళ్లకు ప్రభుత్వ అవకాశం కల్పించడంతో 2014 నుంచి 2019 వరకు వినియోగదారుడు - వాడుకున్న మొత్తం యూనిట్లను లెక్కించి ట్రూఆప్ ఛార్జీ పేరుతో ఒక్కో యూనిట్కు 7 పైసల చొప్పున భారం వేశారు. ఆ మొత్తం భారాన్ని 18 వాయిదాలుగా విభజించి ప్రతినెలా చెల్లించేలా బిల్లులో జారీ చేస్తున్నారు. 2021-22 సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వాడుకున్న వినియోగాన్ని లెక్కించి ఒక్కో యూనిటపై 19 పైసలు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంపై పడిన విద్యుత్ భారాన్ని తగ్గించుకోవడానికి రకరకాల ఛార్జీల పేరుతో వసూళ్లకు తెరలేపింది. దీంతో వినియోగపు ఛార్జీలకు మరో 30 శాతం అదనంగా బిల్లులు జారీ అవుతున్నాయి. దీనికి తోడుగా అడిషనల్ ఛార్జీల బాదుడు సైతం మొదలైంది. గృహోపకరణాలు ఆధారంగా అడిషనల్ ఛార్జీలు వసూలు జరుగుతోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో సతమతమవుతున్న ప్రజలకు విద్యుత్ ఛార్జీలు గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది.

పార్వతీపురం పట్టణంలో ఒక పేదమహిళ తన ఇంటికి గత నెలలో కేవలం 42 యూనిట్లు వినియోగించగా, ఇంధన ఛార్జీ రూ.93 కాగా, ఇతరత్రా ఫిక్స్‌డ్, కష్టమర్, ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరట మరో రూ.204 వడ్డించగా ఈనెల బిల్లు మొత్తం రూ.307కు చేరుకుంది. అంటే దాదాపు 200శాతానికి పైగా అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి. పూరిగుడిసెకు వినియోగించి వారి పరిస్థితే ఇలాఉంటే 100 నుండి 500, 1000 యూనిట్లు వినియోగించుకునే వారి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదు. జిల్లాలోని విద్యుత్ పరిస్థితిపై గృహ, పరిశ్రమ, వినియోగదారులు బయటకు చెప్పలేక పోతున్నప్పటికీ తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు.

కురుపాం : 2021- 22 - 23లో కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించిన సర్దుబాటు రుసుంతో కలిపి ఆగస్టులో బిల్లులను ఇస్తున్నారు. వీటిని చూసి వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.మండలంలోని 12,698 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. సర్దుబాటు రుసుంతో ప్రతి కనెక్షన్‌పై సుమారు రూ.50 నుంచి రూ.500 వరకూ అదనపు భారం పడనుంది. ప్రస్తుత ఆగస్టు నెలకు సంబంధించిన బిల్లులో ట్రూప్ ఛార్జీలతో పాటు ఎఫ్ పి పి సిఎ1, ఎస్ పిసిఎ 2 పేరిట సర్దుబాటు రుసుం విధిస్తున్నారు. 2021-22 లోనూ 2014-19 మధ్య ఉన్న పరిస్థితే ఉందని.. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తాన్ని వసూలు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ దఫా ఏప్రిల్-జూన్ వరకు ఒక్కో యూనిట్‌కు 20 పైసలు, జూలై నుంచి సెప్టెంబరు వరకు 68 పైసలు, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 68 పైసలు, 2024 జనవరి నుంచి మార్చి వరకు ఒక్కో యూనిట్‌పై ట్రూ అప్ పేరిట 67 పైసలుపైగా అదనపు భారం వినియోగదారులు భరించాల్సిందే.

విద్యుత్ కోతలతో ఇబ్బంది

వేళాపాలా లేని విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. విద్యుత్తు ఉంటే గానీ మిషన్ కుట్టలేం. అటువంటిది విద్యుత్ ఎప్పుడు వస్తాదో ఎప్పుడు పోతాదో తెలియని పరిస్థితి. విద్యుత్ శాఖ అధికారులకు సంప్రదించిన సరైన సమాధానం లేక విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఒకవేళ వచ్చినా పావుగంట 20 నిమిషాలు ఉండి మళ్లీ ఆగిపోతుంది. అంతేకాకుండా బిల్లుల భారం పెరిగింది. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

జి. చిన్నారావు,
టైలర్, కురుపాం.

రెట్టింపు బిల్లు వస్తుంది

గతంలో నా ఇంటికి నెలకు రూ.500 లోపే బిల్లు వచ్చేది. గత కొన్నేళ్లుగా విద్యుత్తు బిల్లులను ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి పెంచుతూనే ఉన్నారు. ఆగష్టులో బిల్లుకు ట్రూ ఆప్ సర్దుబాటు రుసుము కలిసి రూ.982 వచ్చింది. గత కొన్నేళ్లుగా విద్యుత్తు ఛార్జీలు ప్రతి మూడు, నాలుగు నెలలకు ఓ సారి పెంచుతూ రావడంతో విద్యుత్ బిల్లులు భారంగా మారుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కిరోసిన్ దీపాలు పెట్టుకోక తప్పేలా లేదు.

బి. శంకర్రావు,
వినియోగదారుడు, కురుపాం.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నాం

రెండు రోజులుగా రాత్రి వేళల్లో కనీసం గంటపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడంలేదు. నగరం మొత్తం సరఫరా లేదంటూ సమాధానం ఇస్తున్నారు. ఓ వైపు అదనపు బిల్లులు వసూలు చేస్తున్నా అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించడంలో విద్యుత్ సంస్థలకు చిత్తశుద్ధి కరువైంది.

కె.విజయలక్ష్మి,
వెంకంపేట, కొత్తకాలనీ పార్వతీపురం.




అధికారులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

కెజిబివి విద్యార్థుల అదృశ్యంపై విచారణ

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలో వాబ, బూర్జిమాను గూడ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినిల అదృశ్యంపై జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. మండలంలోని తూరాయిపు వలస సమీపంలో ఉన్న కేజీబీవీ కళాశాల ఒకేషనల్ ఎంపిహెచ్‌డబ్ల్యు సెకండ్ ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు శనివారం ఒకరికి పుట్టినరోజు కావడంతో ఆరోజు సాయంత్రం వాళ్ల స్నేహితులు కేకు తెచ్చారు. పుట్టినరోజు వేడుకలు జరిగిన వెంటనే శనివారం రాత్రి బయటకు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం విద్యాలయం ప్రత్యేకాధికారి బి.రూప విద్యార్థినిలను లెక్కించగా ఇద్దరు కనిపించలేదు. దీంతో ఆమె డిఇఒకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నీలకంటరావు రంగంలోకి దిగి వాకాబు చేయగా వారి ఇళ్ల వద్దే ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఈ విచారణలో పాలకొండ డిప్యూటీ డిఇఒ విజయకుమారి, జిసిటిఒ రోజారమణి, ఎంఇఒ సూర్యచంద్రరావు, సూపరింటెండెంట్ రంగాచారి తదితరులు ఉన్నారు.

ఇండియా ఆకృతిలో విద్యార్థులు



ప్రజాశక్తి - సీతంపేట

76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పులుపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులచే మూడు రంగులు దుస్తులు ధరించి ఇండియా ఆకారంలో విద్యార్థులు రిహార్సల్స్ చేసి పలువుర్ని ఆకట్టుకున్నారు. అంతేగాక జాతీయ జెండా రూపం క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాక్టీస్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.నవీన్ కుమార్ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కిశోర్‌ను కలిసి మాజీ మంత్రి శత్రుచర్ల, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి, నాయకులు

'అభ్యర్థి ఎవరైనా సమన్వయంతో పనిచేస్తాం'

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ కురుపాం నియోజకవర్గ అభ్యర్థి ఎవరైనా అంతా కలిసికట్టుగా సమన్వయంతో పని చేస్తామని కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ అన్నారు. ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా విలేకరులు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి ఎవరని, కార్యకర్తలకు అర్థం కావడం లేదని, అలాగే గ్రూపులు ఉన్నాయని, దీనిపై కార్యకర్తలకు స్పష్టత ఇవ్వాలని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. కురుపాం నియోజకవర్గంలో టిడిపి గ్రూపులు ఉండడం వాస్తవమేనని, కానీ అభ్యర్థి విషయంలో చంద్రబాబునాయుడు ప్రకటిస్తారని తెలిపారు. అభ్యర్థిని ప్రకటించిన వెంటనే గెలుపునకు నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. అనంతరం శత్రుచర్ల విజయరామరాజు మాట్లాడుతూ చంద్రబాబు యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా తోటపల్లి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన సమయంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి కార్యకర్తకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, డొంకాడ రామకష్ణ, ఎం. పురుషోత్తమనాయుడు, గురాన శ్రీరామ్మూర్తి, సుకేష్ చంద్ర పండా , తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళలతో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

నా నేల - నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల ఆవరణ నుండి ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించి, ఆ ర్యాలీలో పాల్గొంటారని ఆయన చెప్పారు. దేశభక్తి పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల మహిళలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

హౌసింగ్ డిఇ ప్రసాద్‌బాబు



ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురం సబ్ డివిజన్లో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఫ్ఎసి) ఆర్ఐవి ప్రసాద్‌బాబు అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో 11,439 జగనన్న కాలనీలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 5,559 ఇళ్లను పూర్తి చేశామని చెప్పారు. ఇందులో బలిజిపేట మండలంలో 3,253 ఇళ్లకు గాను 1,522 ఇళ్లను, సీతానగరం మండలంలో 2,660 ఇళ్లకు గానూ 1,454 ఇళ్లు, పార్వతీపురంలో 2,623 ఇళ్లకు గానూ, 1,623 ఇళ్లను, పార్వతీపురం అర్బన్‌లో 2903 ఇళ్లకు గానూ 960 ఇళ్లను పూర్తి చేశామన్నారు. శ్లాబ్ లెవెల్ 144 ఇళ్లు, 9 అడుగులు గోడ లెవెల్ 526, బేస్మెంట్ లెవెల్ 2188, పునాది వరకు కట్టిన ఇళ్లు 1530 ఉన్నాయన్నారు. వీటన్నింటిని త్వరగా పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణ పనులపై తమ పరిధిలో ఉన్న ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది అంకితభావంతో పని చేస్తున్నారన్నారు.



కురుపాంలో కురుస్తున్న వర్షం

కురుపాంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో గత వారం రోజులుగా ఎండ వేడితో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత చల్లదనంతో పాటు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించింది. వరి ఆకుమడులు సిద్ధంగా ఉండి చినుకు జాడ లేక ఆకాశం వైపు చూస్తున్న రైతన్నలకు ఈ వర్షంతో పొలాలు దున్ని ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బలిజిపేట : మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతులకు కాస్త ఊరట లభించింది. ఒక దుక్కు దున్నేంత వర్షం పడడంతో ఆకుమడులు ఎండిపోకుండా ఉంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇంతవరకు మండలంలోని కొన్ని ప్రాంతాల వద్ద ఇంజన్లు పెట్టుకొని సాగునీరు తోడుకునేవారు ఆదివారం కురిసిన వర్షం వల్ల అక్కడక్కడ ఆకుమడులు పాడవ్వకుండా ఊరాట లభించిందని మండల ప్రజలు హర్ష వ్యక్తం చేశారు



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

గిరిజనుల జీవనానికి దర్పణం 'భూషణం కథలు'

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

తన ప్రతి రచనలోనూ సమాజంలో మార్పు కోసం ప్రయత్నిస్తూ వ్యక్తుల మెరుగైన జీవితాల కోసం భూషణం కలలుగన్నారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఆదివారం స్థానిక గిరిజన సమావేశ మందిరంలో స్నేహకళా సాహితి, ఎపిటిఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన భూషణం కథలు పరిచయ సభలో ఆయన ప్రసంగించారు. ఎఎస్ విద్యాసాగర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో తొలుత ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులన్నీ భూషణం కథల్లో ప్రతిబింబిస్తాయన్నారు. భూషణం వారసత్వాన్ని అందిపుచ్చుకుని ఈ ప్రాంత రచయితలు బాధ్యతాయుతంగా రచనలు చేయాలన్నారు. ఉపాధ్యాయ పత్రిక సంపాదకుని గానూ, ఎపిటిఎఫ్. నాయకునిగానూ భూషణం అందించిన సేవలు చిరస్మరణీయమైనవని ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు పిఎస్. ప్రకాశరావు అన్నారు. జిఎస్ చలం సంపాదకులుగా వ్యవహరించిన భూషణం కథల పుస్తకాన్ని ప్రముఖ కథారచయిత రౌతు బంగారునాయుడు (సువర్ణముఖి) పరిచయం చేశారు. సమావేశంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొప్పుల భానుమూర్తి, మల్లిపురం జగదీశ్ అతిథులుగా హాజరైన ఈ సమావేశంలో భూషణం కుమారులు సోమశేఖర్, కల్యాణ్, కోడలు పద్మావతి హాజరయ్యారు. వీరికితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన సాహితీవేత్తలు ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక వ్యవస్థాపకులు కెఎన్ మల్లీశ్వరి, దాసరి రామచంద్రరావు, బంకురు జోగినాయుడు, పక్కి రవీంద్రనాథ్, నల్లా బాలకృష్ణ, చందనపల్లి గోపాలరావు, సిరికి స్వామినాయుడు, గడగమ్మ రామకష్ణ, కాకిముక్కల నాగు, పల్ల రోహిణీ కుమార్, కె.కె వర్మ, కె.శ్రీనివాస్ సిహెచ్ పారినాయుడు, గంటేడ సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

- విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు
- రైతులకు 9 గంటల విద్యుత్తు
- 'ప్రజాశక్తి'తో ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి



జిల్లాలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించడమే లక్ష్యమని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్తు కోతలు లేకుండా సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతులకు తొమ్మిది గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్తు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

కొద్దిరోజులుగా విద్యుత్తు కోతలు పెరిగాయి. వాటి నివారణకు తీసుకున్న చర్యలు ఏమిటి?.

జిల్లాలో కొద్ది రోజులుగా అక్కడక్కడ ఇఎల్ఆర్ పేరిట విద్యుత్తు కోతలు విధించడం వాస్తవం. పవన విద్యుత్తు సరఫరా తగ్గడం వల్ల అంతరాయం ఏర్పడింది. గృహాలకు, కమర్షియల్ సంస్థలకు విద్యుత్తు కోతలు లేకుండా చూడాలని, పరిశ్రమలు పని గంటలను తగ్గించుకొనే విధంగా ప్రభుత్వం ఆదేశించింది. గృహ వినియోగదారులకు విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జగనన్న కాలనీల్లో విద్యుత్తు సరఫరాకు తీసుకున్న చర్యలు ఏమిటి?

జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు 30,365 ఇళ్లకు విద్యుత్తు సరఫరా ఇచ్చాం. జగనన్న కాలనీలకు విద్యుత్తు సరఫరా కోసం రామన్నదొరవలస, గుమడాం, గుంకలాం ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నాం. ఉమ్మడి జిల్లాల్లో జగనన్న కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించడం కోసం ఇప్పటివరకు రూ.38.83 కోట్లు ఖర్చు చేశాం.

జిల్లాలో మెరుగైన విద్యుత్తు సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

జిల్లాల్లో 24 గంటల విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చేయాలనే ఉద్దేశంతో కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద ప్రతిపాదనలు కోరింది. దీనిపై సర్వే చేపట్టి, ఏడాదిలోగా పూర్తి నివేదిక, ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలి.

విద్యుత్తు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటి?.

జిల్లాలో ఎటువంటి ప్రమాదం జరగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజల సహకారం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. విద్యుత్తు లైన్లు, స్థంభాలు, సరఫరాలో ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే 1912 నంబరుకు ఫోన్ చేయాలి. అందుబాటులో సిబ్బందికీ తెలియజేయొచ్చు. ఇటీవల జిల్లాలో జరిగిన ప్రమాదాలు అవగాహన రాహిత్యం వల్ల సంభవించాయి. అలాంటి వాటికి తావివ్వకుండా ప్రజలు టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలి. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

శాఖాపరమైన పని తీరు మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

పనిలో మెరుగుదల కోసం శాఖాపరంగా కొన్ని చర్యలను ఉన్నతాధికారులు తీసుకున్నారు. జిల్లాకు మరొక కొత్త డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం రూరల్ డివిజన్ కొత్తగా అందుబాటులోకి వచ్చింది. కొత్తగా మెంటాడ, వుడా సెక్షన్లు ఏర్పాటు చేశారు.



లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?


జిల్లాల్లో లోఓల్టేజ్ సమస్య చాలా తక్కువగా ఉంది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కూడా లోఓల్టేజ్ సమస్యపై పెద్దగా ఫిర్యాదులు రావడం లేదు. మరోవైపు జిల్లాలో విద్యుత్తు పంపిణీకి ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా పంపిణీ నెట్‌వర్క్, విద్యుత్ లైన్లు, స్థంభాలు, ఇంటర్ లింక్ వంటి వాటికి ప్రతిపాదనలు నెల రోజుల్లో సిద్ధం చేసి పంపిస్తాం.

జిల్లాల్లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు సరఫరా ఎలా ఉంది? ఈ ఏడాది ఎంతమంది రైతులకు కొత్త సర్వీసులిచ్చారు?.

జిల్లాలో రైతులకు పంటలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు 9 గంటలపాటు విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. అక్కడక్కడ వాతావరణ పరిస్థితుల కారణంగా అంతరాయం ఏర్పడితే రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో గత నాలుగు నెలల కాలంలో కొత్తగా 1334 సర్వీసులు రైతులకు ఇచ్చాం. జిల్లాలో 44,187 పంపు సీట్లకు విద్యుత్తు సరఫరా చేస్తున్నాం.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు పునరుద్ధరణకు ముందస్తుగా ఎలా సన్నద్ధమయ్యారు?.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు ప్రమాదాలు జరిగిన వెంటనే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతోపాటు అందుబాటులో 150 వరకు విద్యుత్ స్తంభాలు, వైర్లు, పునరుద్ధరణకు కావాల్సిన సామగ్రిని సిద్ధంగా ఉంచాం. వర్షాకాలంలో ప్రజలకు ఏర్పడిన విద్యుత్తు అంతరాయాన్ని వెంటనే సరిచేసేలా ఉద్యోగులను, అందుకు తగిన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచాం.



స్వప్నహైందవిని సన్మానిస్తున్న సాహితీమిత్ర సభ్యులు

మాతృభాష గౌరవాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

మాతృభాష గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. సాలూరు సాహితీమిత్ర బృందం ఆధ్వర్యాన పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన 85వ సాహితీ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్కృత భాష - ప్రయోజనాలు అన్న అంశంపై మాట్లాడారు. సంస్కృత భాష గొప్పతనాన్ని ఆమె వివరించారు. మాతృ భాష గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాహితీ మిత్ర బృందం గౌరవాధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష మాధుర్యాన్ని వెలకట్టలేమన్నారు. డాక్టర్ స్వప్న హైందవి చేసిన సాహిత్య సేవకు గుర్తింపుగా సాలూరు సాహితీ మిత్రబృందం ఆమెను వేగావతీ భారతి బిరుదు తో సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు ఉప్పల గీత, సాహితీ మిత్రబృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెబి తిరుమలాచార్యులు, కోశాధికారి గొట్టాపు శ్రీనివాసరావు మాట్లాడారు.



ఖాళీ బిందెలతో ర్యాలీ చేస్తున్న మహిళలు

పెదపెంకిలో దాహం కేకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గత నెల రోజులుగా గ్రామస్తులు దాహం కేకలు పెడుతున్నారు. ఈ మేరకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం ఖాళీ బిందెలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కొత్త వీధి, బీసీ కోలనీ, దళితవీధి, తెలగ వీధులకు గత నెల రోజులుగా మంచినీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా సంబంధిత అధికారులు కానీ, స్థానిక అధికారులు కానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. మండల స్థాయి అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మంచినీరు ఏర్పాటు చేయడంలో విఫలమవ్వడం వారు చేస్తున్న విధుల నిర్వహణకు ఉదాహరణగా చెప్పొచ్చని విమర్శించారు. గ్రామంలోని మండల స్థాయి నాయకులున్నప్పటికీ ప్రజల సమస్యలు కనిపించకపోవడం బాధాకరమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీరందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15న పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటరౌన్

ఈ నెల 15న స్థానిక రిటైర్డ్ పెన్షన్‌దారుల సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ నిర్వహించడం జరుగుతుందని, అనంతరం 10 గంటలకు రిటైర్డ్ పెన్షన్‌దారుల నెల వారీ సమావేశం జరుగుతుందని రిటైర్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. ఈ సమావేశానికి పెన్షన్‌దారులంతా తప్పనిసరిగా రావాలన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఓటర్ల జాబితా తనిఖీ, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం మండలంలోని ఆయా గ్రామాల్లో బిఎల్ఒలు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉల్లిభద్ర ఆదివారం ఇంటింటి సర్వే జరిగింది. డోర్ నెంబర్లు, బూత్ లెవల్ అధికారులు, వ్యక్తిగతంగా పరిశీలన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. డోర్ నెంబర్లు బిఎల్ఒ యాప్‌లో తనిఖీ చేస్తున్నారు. అలాగే అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వందేళ్ళు దాటిన వారి వివరాలు పరిశీలిస్తున్నట్టు తెలిపారు.



గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖాగ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలున్నాయని, వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఇటీవల ఖాళీ అయిన 13 వాలంటీర్ పోస్టులకు మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బా రూబెన్, ఆర్ఐ పి.నారాయణరావు, మెప్మా సిఎంఎం విజయకుమార్, పవన్ కిరణ్, వేణుమాధవ్ అభ్యర్థులకు ఆదివారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పలు సచివాలయాల్లో ఖాళీలు ఉన్న 13 వాలంటీర్ పోస్టులకు గానూ 78 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఆదివారం జరిగే ఇంటర్వ్యూలకు 58 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించామని, అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాలపై వారి అవగాహనను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులను మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు నియమించడం జరుగుతుందని తెలిపారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ

సీతానగరం: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో ఖాళీ అయిన గ్రామ వాలంటీర్ల పోస్టులకు ఆదివారం స్థానిక ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బూర్జ-2, పెదఅంకలాం సచివాలయ పరిధిలో కృష్ణరాయపురం, పెదభోగిలిలో ఒక్కొక్క వాలంటీర్ పోస్టుల ఖాళీలు అవ్వగా, ఇదివరకే నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం ఆరు దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు నలుగురు హాజరయ్యారన్నారు. సోమవారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు.

కమ్ముకొస్తున్న కరువు మేఘాలు

నెర్రెలుబారిన వరి మడులు
తీవ్ర వర్షాభావంతో అన్నదాత గుండెల్లో రైళ్లు

ప్రజాశక్తి - సాలూరు

తీవ్ర వర్షాభావంతో మండలంలో కరువు మేఘాలు కమ్ముకొస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వర్షాలు పడడం లేదు. దమ్ములు అయిన తర్వాత వర్షాలు లేకపోవడంతో వరి పొలాలు బీటలు వారుతున్నాయి. చెరువుల్లోని నీరు దమ్ములకే సరిపోవడంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని కూర్మరాజుపేటలో సుమారు 500ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. వర్షాధార భూములు కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాకాలమైనా సవవృద్ధిగా వానలు లేకపోవడం అన్నదాతలను కలవరపెడుతోంది. గత నెలలో కురిసిన వర్షాలకు వరి నాట్లు వేశారు. విద్యుత్ బోర్లు వున్న రైతులు వరి పొలాలను కాపాడుకుంటున్నారు. లేని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో సమృద్ధిగా వానలు కురవడంతో వరి పంట ఆశాజనకంగా పండింది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర వర్షాభావంతో నష్టపోయే పరిస్థి తులు నెలకొన్నాయి. మండలంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీరు సరఫరా అయ్యే అవకాశం లేదు. దీంతో వరి సాగు పూర్తిగా వర్షాలపై ఆధారపడి ఉంటుంది.

చుట్టూ ప్రాజెక్టులున్నా ఫలితం సున్నా

సాలూరు పట్టణం, మండలం చుట్టూ సాగునీటి ప్రాజెక్టులున్నా



కప్పల మాదిరిగా పరమాన్నం తింటున్న రైతులు



నర్రెలు తేరిన వరి నాట్లు

స్థానిక పంట భూములకు సాగునీరందే పరిస్థితి లేదు. పాచిపెంటలో పెద్దగెడ్డ ప్రాజెక్టు వల్ల ఈ మండలంలో చాలా తక్కువ భూములకు సాగునీరందుతుంది. మూడు మండలాల్లో 33 గ్రామాలకు చెందిన 11వేల ఎకరాలకు మాత్రమే పెద్దగెడ్డ నీరు చేరుతోంది. వెంగళరాయసాగర్ ప్రాజెక్టు కూడా సాలూరు మండలంలో ఉన్నప్పటికీ స్థానిక భూములకు ఉపయోగం లేదు. విఆర్ఎస్ ఎత్తిపోతల పథకం నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో కూర్మరాజుపేట, బోరబంద, పెదపదం పంచాయతీ పరిధిలో భూములు వర్షాలపైనే ఆధారపడి వున్నాయి.

వర్షాల కోసం కప్ప పండుగ

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూర్మరాజుపేటకు చెందిన రైతులు ఆదివారం వర్షాల కోసం కప్ప పండుగ చేశారు. గ్రామ పొలిమేరల్లో వున్న పణుకు వద్దకు రైతులంతా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వానదేవుడికి పరమాన్నం వండి పణుకుపై వడ్డించుకొని కప్పల మాదిరిగా ఆరగిస్తారు. వర్షాభావ పరిస్థితిలో ఏటా గ్రామస్తులు ఈ కప్ప పండుగ చేస్తున్నారు. ఈ పండుగ చేసిన రోజు వర్షం పడుతుందనే నమ్మకం రైతుల్లో గత కొంతకాలంగా వుంది.



కొటికపెంటలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

కొటికపెంటలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొటికిపెంట, గరేళ్లవలస, కోడికాళ్లవలసలో గ్రామాల్లో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సిఎం రాజన్న దొర ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలుంటే తెలియజేయాలని, సత్వర పరిష్కారం చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా కోటికి పెంట పెద్దగెడ్డ జలాశయం ముంపు గ్రామం వల్ల ప్రధాన సమస్య ఇళ్ల స్థలాలు కావడంతో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామస్తులు రాజన్నదొర దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన త్వరలో ఇళ్ల స్థలాలు కేటాయించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, ఎంపిడిఒ జి.పార్వతి, ఎఒ కె.తిరుపతిరావు, ఎంపిటిసి సభ్యులు డి.ఏడుకొండలు, వైసిపి నాయకులు డోల బాబ్జీ, పి.వీరమనాయుడు, టి.గౌరీశ్వరరావు, సలాది అప్పలనాయుడు, పలువురు సర్పంచులు, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్లే చైర్మన్లా... బిసిలు పనికిరారా?

అరకు పార్లమెంట్ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు బూరాడ రవి

ప్రజాశక్తి - బలిజిపేట

టిటిడి చైర్మన్ పదవిని మరో రెడ్డికి కట్టబెట్టి బిసిలకు ఆశపెట్టి అవమానించిన జగన్‌రెడ్డికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారని అరకు పార్లమెంటు టిడిపి బిసిసెల్ అధ్యక్షులు బూరాడ రవి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో టిడిపి చైర్మన్ కాగితా వెంకట రావు, చదలవాడ కృష్ణమూర్తి, పొట్ట సుధాకర్‌ను నియమించారని, జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే చైర్మన్‌గా తన సొంత చిన్నాన్న వైవి సుబ్బారెడ్డిని రెండోసార్లు చైర్మన్ సీట్లో కూర్చోబెట్టారని, తాజాగా మరో చిన్నాన్న మీ సొంత వర్గానికి చెందిన భూమాన కరుణాకర్ రెడ్డిని చైర్మన్‌ను చేస్తున్నారని అన్నారు. ఇది బీసీలను అవమానించడమేని, రాష్ట్ర స్థాయి పదవులకు దూరం చేయడమేనన్నారు. నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తానని గొప్పగా చెప్పుకుంటున్న జగన్ సలహాదారుల్లో రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడంలేదో సమాధానం చెప్పాలన్నారు. టిటిడి చైర్మన్‌గా బిసిలను ఎందుకు నియమించే లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి హయాంలో మూడుసార్లు బిసిలకు చైర్మన్లుగా అవకాశం కల్పిస్తే అదే మూడు సార్లు మీ సొంతవారికి పదవులు కట్టబెట్టడం బిసిలను అవమానించడమేనని ఆయన అన్నారు. ఇదే నా సామాజిక న్యాయం... ఇదేనా బీసీలకు అండగా నిలవడమని ప్రశ్నించారు. బిసిల కుల కుల కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు తప్ప టిటిడి లాంటి రాష్ట్రస్థాయి పదవులు అందని ద్రాక్షలా మారిందని విమర్శించారు. బిసిలంటే ఎందుకు ఇంత చిన్నచూపని ప్రశ్నించారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బూర్జ- చినంకలాం వంతెన నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

ఈ ప్రాంత చిరకాల కోరికైన బూర్జ-చినఅంకలాం గ్రామాల మధ్య వంతెన నిర్మిస్తానని ఎమ్మెల్యే ఎ.జోగారావు హామీ ఇచ్చారు. మండలంలోని గాదెలవలసలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పజల చెంతకు ప్రభుత్వ పాలనను తీసుకురావడమే కాకుండా రైతులకు అవసరమైన సేవలు ఆర్‌బికె ద్వారా అందజేస్తున్నామన్నారు. రైతులకు విత్తనాలు మొదలు పంట చేతికి వచ్చి తిరిగి అమ్ముకునే వరకు కూడా అన్నీ సేవలను ఆర్‌బికెల ద్వారా అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, స్థానిక సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణ, తిరుపతి రావు, మండల పార్టీ సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, తెంటు వెంకట అప్పల నాయుడు, ఆర్వీ, పిఎసిఎస్ చైర్మన్ బొన్నాడ సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీరాజ్ శాఖ డిఇ రత్నాకర్, ఎఇ చంద్రశేఖర్, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తి కంపెనీ సిఇఒ గౌతమి

ఉత్తమ మహిళా రైతు ఉత్పత్తి కంపెనీగా ఎంపిక

ప్రజాశక్తి -సీతంపేట

ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తి కంపెనీ ఉత్తమ మహిళా రైతు ఉత్పత్తి కంపెనీగా ఎంపికైంది. ఈ మేరకు 75వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో ఎర్రకోట ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలంటూ ప్రధానమంత్రి, కేంద్ర వ్యవసాయ మంత్రి నుంచి పిలుపు వచ్చినట్టు ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ ఎన్ సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ సంస్థ, నాబార్డ్ వారి సహకారంతో మండలంలో 30 గ్రామాల్లో తమ కంపెనీ పనిచేస్తుందన్నారు. ఈ కంపెనీలో 350 మంది మహిళా రైతులు ఉన్నారన్నారు. ఈ కంపెనీ ద్వారా ఈ ఏడాది 20 ట్రక్కుల పైనాపిల్ మార్కెటింగ్ చేశామ న్నారు. అలాగే 15 మంది మహిళలకు పైనాపిల్ జామ్, జ్యూస్ శిక్షణను ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. 20 టన్నుల పసుపు మార్కెటింగ్ చేసి రైతులకు మార్కెట్ ధర వచ్చేలా కృషి చేశామన్నారు. ఈ కంపెనీకి రైతులకు శిక్షణ కార్యక్రమాల్లోనూ, క్షేత్ర సందర్శనలు నిర్వహించి మంచి అభివృద్ధిలోకే తీసుకొచ్చామని తెలిపారు. ఆదివాసీ మహిళ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ హారిక గౌతమి మాట్లాడుతూ 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానం రావడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రధానమంత్రి, కేంద్ర వ్యవసాయ మంత్రి సమక్షంలో ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యక్రమాలపై ప్రణాళికలు తయారు చేస్తామని అన్నారు. ఈ ఆహ్వానం తమ ఆదివాసీలకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ

విజయనగరం టౌన్: వేరొకరికి జీవితాన్ని ప్రసాదించే అవయవ దానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సాయి ఆసుపత్రి వైద్యులు ఎ.శ్రీరామ్మూర్తి విజ్ఞప్తిచేశారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవయవాల మార్పిడి వల్ల మరొకరిని బతికించే అవకాశం దాతకు కలుగుతుందన్నారు.

వీడని ఏనుగుల భయం

బిక్కుబిక్కుమంటున్న రైతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో అడవి ఏనుగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ కనిపిస్తోంది. ఒకప్పుడు కేవలం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకే పరిమితమైన అడవి ఏనుగులు గుంపు సంఖ్య ప్రస్తుతం జిల్లాలోని మూడు గుంపులుగా నాలుగు దిక్కులకు పాకింది. కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టం, గరుగుబిల్లి మండలాల్లో అడవి ఏనుగుల సంచారంతో ప్రజలు, రైతుల కంటిమీద కునుకులేకుండా కాలం వెల్లదీస్తున్నారు. రైతులు పండించే పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. సరిగ్గా 17 ఏళ్ల క్రిందట ఒడిశా లకేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం మన్య ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగులకు పుష్కలమైన నీరు, ఆహారం అందుబాటులో ఉండడంతో ఈ ప్రాంతంలో ఆవాసం ఏర్పర్చుకున్నాయి. ఒడిశాలో ఫ్యాక్టరీల పేరుతో అడవులను నాశనం చేయడంతో అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని అంటున్నారు. అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వ నాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. అసలే ఖరీఫ్ సీజన్ రైతులు వేసుకున్న వరి పంట, అరటి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణానికి ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. ఏనుగుల దాడిలో ఇప్పటివరకు సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మృత్యువాత పడ్డారు. ఏనుగులు ప్రజల ప్రాణాలను తీస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అడవి ఏనుగుల బెడద ఇంకా ఎంత కాలమో అంటూ ప్రజల గగ్గోలు పెడుతున్నారు. ప్రజల ప్రాణాలు తీయకముందే వాటిని తరలించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నారు.



కురుపాం మండలం సంగెడ్డలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఏనుగులను తరలించాలి


జిల్లాలోని ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి ఒడిశా ప్రాంతానికి తరలించేలా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. ఏనుగుల దాడితో విలువైన ప్రాణాలు, పంట నష్టం, ఆస్తి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

- కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం మన్యం జిల్లా కార్యదర్శి

సంగెడ్డలో ఏనుగుల గుంపు సంచారం

కురుపాం : ఏనుగులు గుంపు కురుపాం పంచాయతీ నుంచి గుమ్మడిగూడ పంచాయతీ సంగెడ్డ పరిసర ప్రాంతాల్లో పొలాల్లోకి చేరుకున్నాయి. గుమ్మడిగెడ్డకు అత్యంత సమీపంలో ఈ పొలాలు ఉన్నాయి. గుంపులో చిన్న ఏనుగు పిల్లలు ఉండడంతో గుమ్మడిగెడ్డలో పెద్ద పెద్ద గోతులు ఉండడం వల్ల జరగరాని ప్రమాదం జరిగితే చిన్న ఏనుగులు అందులో పడి మృతి చెందడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ కొన్ని చోట్ల ఉన్నాయని, గతంలో మాదిరిగా విద్యుత్ ప్రమాదం జరగకుండా అటవీశాఖ అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏనుగులకు అవసరమైన నీరు, ఆహారం ఒకే చోట ఇక్కడ లభించే అవకాశం ఎక్కువగా ఉందని ఎవరికీ హాని తలపెట్టకుండా ఉంటే ఎన్నాళ్లు ఉన్న అభ్యంతరం లేదని రైతులు పేర్కొన్నారు.

దేవాంగుల సంఘం మండల అధ్యక్షులుగా రవి



ప్రజాశక్తి - పాలకొండ

దేవాంగుల సంఘం పాలకొండ మండల అధ్యక్షుడిగా న్యాయవాది కర్రా రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవర్స్ కాలనీలోని చేనేత సహకార షెడ్‌లో ఆదివారం నిర్వహించిన దేవాంగ సంఘ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. , ప్రధాన కార్యదర్శిగా తూతిక శ్రీనివాసరావు, కోశాధికారిగా బళ్ల భీమాలింగేశ్వరరావు, సభ్యులుగా బళ్ల వెంకటరావు, బత్తుల తవిటిరాజు, కొమ్మాన శ్రీనివాసరావు, గోరు రమేష్, బళ్ల షణ్ముఖరావు, కర్రా రాజు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వార్డుల్లో గుర్తించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 28వ వార్డులో కౌన్సిలర్ మజ్జి శశికర్, చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు వార్డులను సందర్శించి, అందులో భాగంగానే వరుసగా ఈ వార్డులో కార్యక్రమం నిర్వహించి సమస్యలను గుర్తించి వాటిని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లడమే కాకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, స్థానిక వైసిపి నాయకులు, వివిధ వార్డుల సచివాలయం కన్వీనర్లు, గహసారధులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

ఫిర్యాదు చేసినందుకు వేధింపులా..?

ప్రజాశక్తి - మక్కువ

తనపై లైంగికంగా వేధింపులు చేస్తున్నారని ఫిర్యాదు చేసినందుకు తగిన చర్యలు చేపట్టకుండానే మళ్లీ వేధింపులు మొదలు పెట్టారని ఓమహిళా ఉద్యోగిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూడి అరుణ 2007 నుంచి ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తుంది. ఇక్కడి పిహెచ్‌సి వైద్యాధికారి రఘు కుమార్ తనపైన లైంగిక ఆరోపణలు చేశారంటూ జులై 10న స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే ఈ ఆరోపణలపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణకు వచ్చిన అధికారి డాక్టర్ డి.భాస్కరరావు ఏకపక్షంగా విచారణ జరిపారని, తనకు న్యాయం జరగలేదని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విచారణ సమయంలో తనను బెదిరింపులకు గురి చేశారని, ఫిర్యాదు వెనక్కు తీసుకోకపోతే తోటి ఎఎన్ఎంలచే కేసులు పెడతామన్నారని ఆమె అన్నారు. డాక్టర్ రఘుకుమార్ విచారణాధికారికి విందు భోజనాలు ఏర్పాటు చేశారని, విచారణ సమయంలో 10 నుండి 15 మంది సంబంధం లేని వ్యక్తులు వచ్చి భయపెట్టారని అన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ కూడా బ్లాక్ చేశారని అన్నారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ డిఎంహెచ్ఒ కార్యాలయం నుండి తనకు ఎటువంటి విచారణ కాపీ ఇవ్వలేదన్నారు. తనకు జిఎన్ఎం ట్రైనింగ్‌కు అవకాశం వచ్చినా కక్ష సాధింపు చర్యలతో వైద్యాధికారి పంపించలేదని అన్నారు. కలెక్టర్‌కు తప్పుడు నివేదిక ఇచ్చి ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారని ఆరోపించారు. తనకు న్యాయం జరిగేలా మళ్లీ విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులను ఆమె కోరారు.



మృతుడు దుర్గాప్రసాద్

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం

పార్వతీపురంరూరల్ : స్థానిక పట్టణ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం పాలకొండ మండలం అన్నవరం గ్రామానికి చెందిన గొట్టాపు దుర్గాప్రసాద్ (19) బైపాస్ కాలనీలో నివాసం ఉంటున్న అతని అమ్మమ్మ తూముల దుర్గమ్మ ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్తానని చెప్పి ఇంటి నుండి బయటికి వెళ్లాడు. విశాఖపట్నం నుండి రాయగడ వైపు వెళ్లే రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.